
సాక్షి
నిజామాబాద్
బుధవారం। 5। మార్చి। 2025



మెనూ ప్రకారం భోజనం..
విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు.
- 8లో ▸



గరిష్టం/కనిష్టం
39.2 /15.4

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్‌వోబీ పైనుంచి రాకపోకలు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పైనుంచి మంగళవారం రాకపోకలు ప్రారంభమయ్యాయి. నాలుగు సంవత్సరాల క్రితం మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి, గోవింద్‌పేట్, మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామాల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ వద్ద చేపట్టిన ఆర్‌వోబీ పనులు రెండు సంవత్సరాల క్రితం పూర్తికాగా, మామిడిపల్లి వద్ద పనులు నత్తనడకన సాగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రెండు సంవత్సరాలుగా వాహనాలను దారి మళ్లించడంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాదారులు గోవింద్‌పేట్ మీదుగా వెళ్లాల్సి వచ్చింది. ఎట్టకేలకు పనులు పూర్తి కావడంతో మామిడిపల్లి మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి లేని అడ్మిషన్లపై చర్యలు తప్పవు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడితే నోటీసులు ఇవ్వకుండానే పాఠశాలలను మూసివేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు అనుమతి లేకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని, పాఠశాలల అనుమతులు కూడా పొందడం లేదని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ మండల విద్యాశాఖ అధికారులు తక్షణమే ఇలాంటి పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అడ్మిషన్లు తీసుకునే ముందు పాఠశాలల వివరాలను తెలుసుకోవాలన్నారు.

ప్రజావాణిని వినియోగించుకోవాలి



సుభాష్‌నగర్: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆర్ రవీందర్ ఒక ప్రకటనలో కోరారు. వినియోగదారుల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు 2024 జూన్ 17 నుంచి ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజావాణిని అన్ని సర్కిల్, డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారుల విద్యుత్ బిల్లులు, మీటర్ల సమస్యలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు కేటగిరి మార్పు, పేరు మార్పు, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు తదితర సమస్యలను తీవ్రత ఆధారంగా పరిష్కరించడానికి ప్రజావాణి దోహదపడుతుందని తెలిపారు. విద్యుత్ ప్రజావాణికి ఇప్పటివరకు 614 ఫిర్యాదులు అందగా, 469 సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు.

పోలింగ్ సామగ్రికి నష్టం వాటిల్లొద్దు



నిజామాబాద్ అర్బన్: ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లతోపాటు ఇతర పోలింగ్ సామగ్రికి నష్టం వాటిల్లకుండా పూర్తిస్థాయిలో సదుపాయాలున్న గోదాముల్లో భద్రపర్చాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. అవసరమైతే చెదల నివారణ కోసం పెస్ట్ కంట్రోల్ చేయించాలన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో ఉన్న ఈవీఎం గోదామును అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాము సీల్‌ను తెరిచారు. ఎన్నికల సామగ్రి భద్రపర్చిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ కొనసాగిన మరమ్మతు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఈఈ శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సిబ్బంది సాత్విక్, విజేందర్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- 'నిమిషం' నిబంధన లేదు..
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం
- పరీక్షలు రాయనున్న 36,222 మంది విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ కళాశాల సెంటర్‌లో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఎగ్జామినేషన్ సిబ్బంది

నిజామాబాద్ అర్బన్: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి పరీక్ష రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 'నిమిషం' నిబంధన లేకున్నప్పటికీ విద్యార్థులు సమయానికి ఎగ్జామినేషన్ సెంటర్‌కు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతి వాచీలను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మొత్తం 57 సెంటర్లలో పరీక్షలు కొనసాగనున్నాయి. సెంటర్లలోని సీసీ కెమెరాలను ఇంటర్ బోర్డు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రవికుమార్ సూచించారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించిన మొత్తం 36,222 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పరీక్షలు రాయనున్న విద్యార్థులు

	ఫస్టియర్	సెకండియర్
జనరల్	15,053	16,072
ఒకేషనల్	2,736	2,361
మొత్తం	17,789	18,433

పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేది వీరే..

- 57 మంది చీఫ్ సూపరింటెండెంట్లు
- 57 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు
- మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు
- ఎనిమిది మంది సిట్టింగ్ స్క్వాడ్‌లు
- ఒక హైపవర్ కమిటీ
- జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ



కోటగల్లిలోని మహిళ కళాశాల సెంటర్‌లో పగిలిన పైకప్పు

అసౌకర్యాల మధ్యే..

ప్రభుత్వ కళాశాలల్లో ఏర్పాటు చేసిన సెంటర్లలో అసౌకర్యాలు నెలకొన్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో వసతులలేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ సెంటర్‌లో 422 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పైకప్పు రేకులు పగిలిపోయాయి. నేరుగా తరగతి గదిలోకి సూర్యకిరణాలు ప్రసరిస్తున్నాయి.

■ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల బి సెంటర్‌లో అనేక అసౌకర్యాలు ఉన్నాయి. ఈ కళాశాలలో 310 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, ఇక్కడ విద్యుత్ అందుబాటులో లేదు. తాత్కాలికంగా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందుబాటులో లేవు. మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.

■ మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 408 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, ఇక్కడ కళాశాలకు ప్రహరీ లేదు. ధర్పల్లిలోనూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడు గదులు మాత్రమే అందుబాటులో ఉండగా 550 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఇక్కడ ప్రహరీ లేకపోవడంతో బయటి వ్యక్తులు ఎటువైపు నుంచి వస్తారో గుర్తించలేని పరిస్థితి ఉంది.

తేలని ఫలితం.. వీడని ఉత్కంఠ

- పోటీ త్రిముఖం
- కోటా ఓట్ల మార్కును చేరుకోని అభ్యర్థులు
- ఎలిమినేషన్ ప్రక్రియతోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం
- ఆధిక్యంలో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి



పట్టభద్రుల ఓట్లను లెక్కిస్తున్న కౌంటింగ్ సిబ్బంది

సాక్షి,పెద్దపల్లి: ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం ఉత్కంఠను రేపుతోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు జరిగిన కౌంటింగ్‌లో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు పోటాపోటీగా ఓట్లు సాధించారు. ఏ ఒక్క అభ్యర్థి నేరుగా కోటా ఓట్లు చేరుకునే అవకాశాలు కనిపించలేదు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలుపోటములు తేలకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లపై అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తం చెల్లుబాటైన ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఎలిమినేషన్ ప్రక్రియ ద్వారా ఫలితం తేలనుంది. ట్రయాంగిల్‌గా సాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోరు సర్వత్రా ఆసక్తి కలిగిస్తోంది.

పోటాపోటీ ఓట్లు..

పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం మొత్తం 56 మంది అభ్యర్థులు పోటీపడినా.. ప్రధానంగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణ విస్తృత ప్రచారం చేశారు. దానికి అనుగుణంగానే ఈ ముగ్గురికి పోటాపోటీగా ఓట్లు వచ్చాయి. 6వ రౌండ్ పూర్తయ్యే సమయానికి బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు ముగ్గురు కలిసి సుమారు లక్ష ఓట్లు సాధించగా, బరిలో నిలిచిన 53 మంది అభ్యర్థులందరూ కలిపి కేవలం 10 వేల లోపు ఓట్లు మాత్రమే సాధించారు. దీంతో మూడోస్థానంలో నిలిచే అభ్యర్థి ఎవరనేదానిపై ఎమ్మెల్సీ ఫలితం ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ప్రతి రౌండ్‌లో..

మొత్తం 21 టేబుళ్ల ద్వారా 12 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. మొదటి రౌండ్‌లో బీజేపీ అభ్యర్థికి కాంగ్రెస్ అభ్యర్థిపై 36 ఓట్ల మెజార్టీ వచ్చింది. రెండోరౌండ్‌లో 1,457 ఓట్ల మెజార్టీ, మూడోరౌండ్‌లో 3,005 ఓట్లు, నాలుగో రౌండ్‌లో 1,263 ఓట్లు, ఐదోరౌండ్‌లో 1,381 ఓట్ల మెజార్టీ వచ్చింది. 6వ రౌండ్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి బీజేపీ అభ్యర్థిపై 211 ఓట్ల మెజార్టీ సాధించారు. మొత్తంగా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 45,401 ఓట్లు సాధించి ప్రత్యర్థులపై 6,931 ఓట్ల మెజార్టీతో అంజిరెడ్డి ముందంజలో ఉన్నారు. 38,470 ఓట్లతో నరేందర్‌రెడ్డి సెకండ్ ప్లేస్‌లో, 31,481 ఓట్లతో ప్రసన్నహరికృష్ణ మూడోస్థానంలో నిలిచారు. మందకొడిగా సాగుతున్న కౌంటింగ్ ప్రక్రియకు తోడు పోటాపోటీగా అభ్యర్థులు ఓట్లు సాధిస్తుండటంతో రౌండ్ రౌండ్‌కూ ఉత్కంఠ పెరిగింది. రెండోప్రాధాన్యత ఓట్లపైనే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు.

ఎవరికీ దక్కని విన్నింగ్ కోటా ఓట్లు

పోస్టల్ ఓట్లతో కలిసి మొత్తం 2,52,000 ఓట్లు పోలవగా, అందులో సుమారు 28 వేల ఓట్లు చెల్లనివిగా అధికారులు నిర్ధారించారు. చెల్లనిఓట్లు పోగా మిగిలిన 2,24,000 ఓట్లలో సగం ఓట్లు.. అంటే 1,12,001 ఓట్లను విన్నింగ్ కోటా ఓట్లుగా నిర్ధారించారు. పోటీలో ఉన్న ఏ ఒక్క అభ్యర్థి నేరుగా కోటా ఓట్లను సాధించే పరిస్థితి కానరావడం లేదు. దీంతో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేషన్ చేస్తూ రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలనుంది. ఈ ప్రక్రియ పూర్తిచేసి ఫలితం తేలేందుకు బుధవారం రాత్రి వరకూ సమయం పట్టే అవకాశం ఉందని అభ్యర్థులు అంచనా వేస్తున్నారు.

కౌంటింగ్ వివరాలు

మొత్తం ఓట్లు (పోస్టల్ ఓట్లతో కలిపి)	2,52,000
చెల్లని ఓట్లు	28,000 (11.01శాతం)
చెల్లుబాటైనవి	2,24,000
విన్నింగ్ కోటా ఓట్లు	1,12,001(సుమారు)
బరిలో నిలిచిన అభ్యర్థులు	56

రైతులకు సాంకేతికతను చేరువ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పొలాస వ్యవసాయ పరిశోధన కేంద్రం ఇన్‌చార్జి శ్రీలత

రుద్రూర్: వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో పని చేస్తూ రైతులకు సాంకేతికతను మరింత చేరువ చేయాలని పొలాస వ్యవసాయ పరి శోధన కేంద్రం ఇన్‌చార్జి, సహ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీలత అన్నారు. రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి ఆమె హాజరయ్యారు. జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం, కామరెడ్డి జిల్లాలోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు గత ఏడాది చేపట్టిన పరిశోధన అంశాల మీద, వచ్చే వానకాలం, యాసంగిలో చేపట్టబోయే పరిశోధన అంశాలపై సమీక్ష నిర్వహించి తగు సూచనలు అందించారు. రుద్రూర్ కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అంజయ్య మాట్లాడుతూ ప్రణాళిక రూపొందించుకుని రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్, బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివకృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధక జాయింట్ డైరెక్టర్ జగన్నాథ చారి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, శాస్త్రీయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా యూరియా విక్రయాలు!

- పరిమితి లేకుండా పంపిణీ చేస్తున్న డీలర్లు, సొసైటీలు
- ఒక్కొక్కరికి 50 బస్తాలకు మించి ఇస్తున్న వైనం
- పర్యవేక్షణ చేయని వ్యవసాయాధికారులు
- తద్వారా పలు చోట్ల ఏర్పడుతున్న ఎరువుల కొరత

ధర్పల్లి మండలం గోవింద్‌పల్లిలో ఒక రైతు 55 ఎరువుల బస్తాలు కొనుగోలు చేసినట్లు రికార్డులో నమోదైంది. అలాగే భీమ్‌గల్, కంజర, రెంజల్, సాలూర, మాక్లూర్, పొతంగల్, బీమన్‌పల్లి ప్రాంతాల్లో సైతం కొందరు రైతులు ఒక్కొక్కరు 45 బస్తాలకు పైగా తీసుకెళ్లినట్లు లెక్కలున్నాయి. నిజంగా రైతులే కొనుగోలు చేసి తీసుకెళ్లారా? లేదా వారి పేరుతో డీలర్లు, సొసైటీల బాధ్యులు బస్తాలను పక్కదారి పట్టించారా? అనే సందేహం కలుగుతోంది.



బాల్కొండలో యూరియా కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఎరువుల విక్రయాలు అడ్డగోలుగా జరుగుతున్నాయి. పరిమితికి మించి లెక్క లేకుండా యూరియా బస్తాలు ఇవ్వడంతో పలు చోట్ల కొరత ఏర్పడుతోంది. మార్కెట్‌లో నెలకొన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని డీలర్లు, సొసైటీల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఎరువుల అమ్మకాలపై వ్యవసాయాధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న యూరియా బస్తాలు పక్కదారి పడుతున్నాయా? అనే అనుమానం కలుగుతోంది. ఎందుకంటే ప్రస్తుతం యాసంగి సీజన్‌లో ఎన్నడూ లేనంతగా యూరియా విక్రయాలు జరుగుతున్నాయి. ప్రతి ఏడాది యాసంగిలో గరిష్టంగా 74 వేల మెట్రిక్ టన్నుల యూరియా అమ్ముడయ్యేది. వ్యవసాయ శాఖ 75 వేల మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేయగా, ఇప్పటికే 76,840 మెట్రిక్ టన్నులు అమ్ముడు పోయింది. రైతుల నుంచి ఇంకా డిమాండ్ రావడంతో వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు జిల్లాకు యూరియాను తెప్పిస్తోంది. బాల్కొండ, నందిపేట్, డొంకేశ్వర్, నవీపేట్ లాంటి మండలాల్లో డిమాండ్ పెరిగింది. తద్వారా ఈ ప్రాంతాలకు అధికారులు ఎక్కువగా యూరియా నిల్వలను కేటాయిస్తున్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తగ్గడంతో రైతులు ఇటీవల నాట్లు వేశారు. దీంతో ఈ ప్రాంతాల్లో యూరియా అమ్మకాలు పెద్ద మొత్తంలో సాగుతున్నాయి.

పరిమితి లేదు..

యూరియా బస్తాల అమ్మకాలపై పరిమితి పెట్టకపోవడంతో రైతులు అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. వాస్తవానికి ఒక రైతుకు ఒక సీజన్‌లో యాభైకి మించి బస్తాలు ఇవ్వడానికి అవకాశం లేదు. రైతుకు ఎన్ని బస్తాలు ఇస్తున్నారనేది ఈ-పాస్ మిషన్‌లో రికార్డు అవుతుంది. కానీ, ఆ వివరాలను అధికారులు పరిశీలించడం లేదు. డీలర్లు, సొసైటీలు వేరే రైతుల పేరుతో యూరియాను అమ్ముతున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో ఎరువుల కొనుగోళ్లు భారీగా జరిగాయి. ఎరువులన్ని ఎక్కడిపోతున్నాయో కూడా అధికారులు కనీసం ఆరా తీయడం లేదు. అంతా 'మామూలు'గా తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా ఎకరం పొలానికి మూడు బస్తాల యూరియా సరిపోనుండగా కొందరు రైతులు ఎనిమిది బస్తాల వరకు వేస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించడం లేదు.

అమ్మకాలను పరిశీలిస్తాం

ఈ యాసంగి సీజన్‌లో అంచనాకు మించి యూరియా అమ్మకాలు జరిగాయి. రైతులు ఎక్కువ బస్తాలను కొనుగోలు చేసి అవసరానికి మించి వరి లో చల్లుతున్నట్లుగా సమాచారం వచ్చింది. లెక్క లేకుండా యూరియా విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం. జిల్లాలో యూరియా కొరత లేదు. 3వేల మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు అందుబాటులో ఉన్నాయి.
– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

తెయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ టీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం యాదగిరి, కంట్రోలర్ సంపత్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. బీఏలో 28.24 శాతం, బీకాంలో 34.10, బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో 40.38, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 23.89, బీబీఏలో 42.21, బీసీఏలో 9.09శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 19,574మంది విద్యార్థులు హాజరుకాగా , 6,436మంది (32.88శాతం) ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. మాజీ కంట్రోలర్ ఎం అరుణ, అడిషనల్ కంట్రోలర్లు డాక్టర్ నందిని, డాక్టర్ శాంతాబాయి, డాక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలపై గంజాయి పడగ

- మత్తులో చిత్తవుతున్న యువత
- రోజురోజుకు విస్తరిస్తున్న విక్రయాలు
- ఆందోళనలో తల్లిదండ్రులు..

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకు గంజాయి విక్రయాలు విస్తరిస్తున్నాయి. డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల్లో యువత గంజాయికి అలవాటు పడుతూ తమ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు. విషయం తల్లిదండ్రులకు తెలిసి మందలించినా మారకపోగా, గంజాయి కొనుగోలు చేసేందుకు డబ్బుల కోసం ఎదిరించే స్థాయికి చేరుకుంటున్నారు. మత్తుకు అలవాటు పడిన తమ పిల్లలను ఎలా దారికి తెచ్చుకోవాలో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొందరు చేసేది లేక తమ పిల్లలను గల్ఫ్ దేశాలకు పంపిస్తున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా..

గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల్లో గంజాయి విక్రయాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. స్కూల్ పిల్లలతోపాటు కాలేజీ పిల్లలు, యువత బానిసలుగా మారుతున్నారు. గంజాయి అలవాటుతో కొందరు పిల్లలు చదువు మానేసి అల్లరిచిల్లరగా తిరుగుతున్నారు. మత్తుకు బానిసవుతున్న యువత సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. గంజాయి కొనుగోలు చేసేందుకు అవసరమైన డబ్బుల కోసం చిన్న చిన్న చోరీలకూ పాల్పడుతున్నారు. చైన్ స్నాచింగ్‌లకూ వెనుకాడటం లేదు. దాడుల ఘటనలూ చోటుచేసుకుంటున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్టణంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వాహనాలు, రైలు మార్గం ద్వారా గంజాయిని తీసుకువస్తున్నారు. తర్వాత రహస్య ప్రాంతాల్లోకి తీసుకెళ్లి స్థానిక విక్రేతలకు కిలో రూ.11వేల నుంచి 13వేలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. స్థానిక వ్యాపారులు వాటిని పొట్లాలుగా మార్చి ఒక్కో పొట్లం రూ.300 నుంచి రూ.500 వరకు యువతకు అమ్ముతున్నారు. ఇందుకోసం మొబైల్ ఫోన్‌లలో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా డిచ్‌పల్లి మండల కేంద్రంతోపాటు నడిపల్లి తండా, బీబీపూర్, ఖిల్లా డిచ్‌పల్లి, ఘన్‌పూర్ గ్రామాల్లో గంజాయి దందా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. అలాగే ఇందల్వాయి మండల కేంద్రంతోపాటు తిర్మన్‌పల్లి, కొన్ని గిరిజన తండాల్లో గంజాయి విక్రయాలతోపాటు హుక్కా కేంద్రాలు కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం



గంజాయి, మత్తుపదార్థాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. స్పెషల్ డ్రైవ్ ద్వారా వాహనాలను తనిఖీ చేస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో రహస్యంగా గంజాయి అమ్మకాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే మండలంలోని మెంట్రాజ్‌పల్లి శివారులో ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న గంజాయి ని పట్టుకుని నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించాం. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలి. అప్పుడే యువత మత్తు పదార్థాల బారిన పడకుండా రక్షించగలుగుతాం. – మల్లేశ్, సీఐ, డిచ్‌పల్లి



క్లుప్తంగా

రైతు సంక్షేమం కోసం పనిచేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న సాయిరెడ్డి

నిజామాబాద్‌ రూరల్‌: రైతు సంక్షేమం కోసం చివరి శ్వాస వరకు పనిచేస్తానని భారతీయ కిసాన్‌ సంఘ్‌ జాతీయ అధ్యక్షుడు కొండెల సాయి రెడ్డి అన్నారు. మంగళవారం రూరల్‌ మండలం మారుతీనగర్‌లో భారతీయ కిసాన్‌ సంఘ్‌ 46వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్‌సీఎస్‌ఎఫ్‌ తిరిగి ప్రారంభించడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన ఆర్‌ఎస్‌ఎస్‌ విభాగ్‌ ప్రచారక్‌ నర్రా వెంకట శివకుమార్‌ మాట్లాడుతూ.. రైతు ద్వారానే సమాజంలో పరివర్తన సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డిని సంఘ సభ్యులు, రైతులు సన్మానించారు. కార్యక్రమంలో కె నారాయణరెడ్డి, వీరస్వామి, వినయ్‌ కుమార్‌, డి వాసుదేవ రావు, గడ్డం దశరథ్‌రెడ్డి, అధికారులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌ కార్డుల తొలగింపుపై కూలీల ఆగ్రహం

మోపాల్‌: మోపాల్‌ మండలంలోని ఎల్లమ్మకుంటలో 81 జాబ్‌కార్డులను, 131 మంది తొలగింపుపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధిహామీ లాగిన్‌ నుంచి ఒకేసారి ఒకే గ్రామం నుంచి ఇంత మొత్తంలో జాబ్‌కార్డుల తొలగింపుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకానున్న నేపథ్యంలో జాబ్‌కార్డులు రద్దు కావడం పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని కూలీలు ఇటీవల కలెక్టర్‌ దృష్టికి సైతం తీసుకెళ్లారు. గత మే, జూన్‌ నెలలో పని చేసిన కూలీల జాబ్‌కార్డులు తొలగించడంతో ఆందోళన చెందుతున్నారు. కూలీనాలీ చేసుకుని జీవనం సాగిస్తున్న తమ జాబ్‌కార్డుల తొలగింపునకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు. వెంటనే తప్పును సరి చేసి జాబ్‌కార్డులు తిరిగి ఇప్పించాలని కూలీలు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఎంపీడీవో రాములునాయక్‌ను వివరణ కోరగా జాబ్‌కార్డుల జాబితా నుంచి తొలగించిన వారి పేర్లు చేర్చుతామని, కూలీలు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.

సబ్‌ రిజిస్ట్రార్‌-2కు 14 రోజుల రిమాండ్‌

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలో రూ.10 లంచం తీసుకుంటూ పట్టుబడిన రిజిస్ట్రార్‌-2 శ్రీరామరాజు, స్వీపర్‌ వెంకట్రావుకు నాంపల్లిలోని ఏసీబీ కోర్టు 14 రోజుల రిమాండ్‌ విధించింది. వీరిని చర్లపల్లిలోని జైలుకు తరలించారు. అంతేకాకుండా నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని శ్రీరామరాజు ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ఇందులో పలు డాక్యుమెంట్లు లభించినట్లు సమాచారం.

పోలీస్‌ వాహనం బోల్తా

బోధన్‌రూరల్‌: మండలంలోని బండార్‌పల్లి శివారులో రూరల్‌ పీఎస్‌కు చెందిన పోలీస్‌ వాహనం టైర్‌ పేలి బోల్తాపడింది. విధి నిర్వహణలో భాగంగా మంగళవారం బోధన్‌ మండలం బండార్‌పల్లికి వెళ్లి వస్తుండగా గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద వాహనం టైర్‌ పేలింది. దీంతో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలో బోల్తాపడింది. వాహనంలో డ్రైవర్‌ మాత్రమే ఉండటంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌పై అట్రాసిటీ కేసు

- మునిపల్లిలోని ఓ భూవివాదంలో డిచ్‌పల్లి సీఐ, జక్రాన్‌పల్లి ఎస్సై, కానిస్టేబుల్‌పై..
- హోంశాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ, సీపీలు విచారణ జరపాలి
- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు జస్టిస్‌ బి విజయసేన్‌రెడ్డి



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌కమిషనరేట్‌ పరిధిలోని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్‌ మహేందర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని హైకోర్టు, ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌, జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాలిలా ఉన్నాయి..

జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన రావుట్ల అలియాస్‌ రాగుట్ల నచ్చన్నకు సర్వే నంబర్‌ 197/ఆలో ఎకరం భూమి ఉంది. ఈ భూమిలో వడ్డెర కులానికి చెందిన పలువురు దేవుడి ప్రతిమను ఏర్పాటు చేసి షెడ్డు నిర్మాణం చేపట్టారు. నచ్చన్న పని నిమిత్తం భూమి వద్దకు వెళ్లగా అక్కడ షెడ్డు నిర్మించి ఉన్నట్లు గుర్తించి తనకు తెలిసిన వారికి, కులస్తులకు సమాచారం అందించి అక్కడికి వెళ్లారు. షెడ్డు నిర్మాణం ఎలా చేపట్టారని నచ్చన్న తరపున వారు ప్రశ్నించడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో నచ్చన్నతోపాటు ఆయన తరపున వచ్చిన కులస్తులు జక్రాన్‌పల్లి పీఎస్‌కు వెళ్లి ఎస్సై తిరుపతికి ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌కు ఫిర్యాదు చేసి మళ్లీ భూమి వద్దకు వెళ్లారు. భూమిలో పంట వేస్తుండగా జక్రాన్‌పల్లి పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్‌ మహేందర్‌ అక్కడికి చేరుకుని పనులు నిలిపివేయాలని నచ్చన్నతోపాటు మహిళలు, కులస్తులను హెచ్చరిస్తూ మహిళలను అసభ్యపదజాలంతో దూషించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టును నచ్చన్న ఆశ్రయించారు. గతేడాది డిసెంబర్‌ 2న డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌తోపాటు ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని స్పెషల్‌ జడ్జి, ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌, డిస్ట్రిక్ట్‌ అడిషనల్‌-2 జడ్జి టి శ్రీనివాస్‌ తీర్పు వెలువరించి ఇన్‌చార్జి సీపీ సింధుశర్మకు పంపించారు. కానీ రెండు నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసు కోకపోవడంతో దీనిపై నచ్చన్న ఈ ఏడాది జనవరి 24న హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో నిజామాబాద్‌ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తోపాటు కానిస్టేబుల్‌ మహేందర్‌ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకువాలని ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్‌ అట్రాసిటీ కేసు నమోదు చేసి దీనికి సంబంధించిన నివేదిక 30 రోజుల్లో అందించాలని గత నెల 4న కలెక్టర్‌, సీపీ, జక్రాన్‌పల్లి తహసీల్దార్‌, జక్రాన్‌పల్లి పీఎస్‌ ఎస్సై తిరుపతికి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ సెక్రెటరీ జీఎస్‌ పాండాదాస్‌ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది డిసెంబర్‌ 24న జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను అమలు చేయకపోవడంతో గత నెల 27న బాధితుడు హైకోర్టును ఆశ్రయించగా, సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి, భూమిలోని షెడ్డును తొలగించి బాధితుడికి అప్పగించాలని హైకోర్టు జస్టిస్‌ బి విజయసేన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోపాటు కేసు నమోదు చేయకపోవడానికి గల కారణాలపై హోంశాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ, పోలీస్‌కమిషనర్‌ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. హైకోర్టు ఉత్తర్వులు వచ్చినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. భూమిలో ఉన్న దానిని తొలిగించకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేయకుండా స్థానికంగా ఒత్తిడితోనే ఈ భూమి వ్యవహారం వివాదంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోలీసులు పట్టించుకోలేదు



నా భూమిలో దేవుడి ప్రతిమలు పెట్టి షెడ్డు నిర్మించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. దీంతో కోర్టుకు వెళ్లాను. పోలీసులపై చర్యలు తీసుకోవాలి. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆ భూమిని నాకు అందించాలి.

– నచ్చన్న, మునిపల్లి, జక్రాన్‌పల్లి

పరిశోధనలతోనే విప్లవాత్మక మార్పులు

తెయూ వీసీ ప్రొఫెసర్‌ యాదగిరిరావు



ప్రసంగిస్తున్న వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): యూనివర్సిటీల్లో క్షేత్రస్థాయి పరిశోధనలే సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాయని తెలంగాణ యూనివర్సిటీ వీసీ టి యాదగిరిరావు పేర్కొన్నారు. తెయూ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ విభాగం ఆధ్వర్యంలో 'పరిశోధన పత్రాల తయారీ' అనే అంశంపై నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌ కార్యక్రమానికి వీసీ హాజరై మాట్లాడారు. యువత నూతన వినూత్న మార్పుల కనుగుణంగా పరిశోధనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే యూనివర్సిటీలు పరిశోధనలకు కేంద్రంగా వర్ధిల్లుతాయన్నారు. రిజిస్ట్రార్‌ ఎం యాదగిరి మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాలలో సమాజమే ప్రయోగశాలగా భావించి విద్యార్థులు పరిశోధనలు చేయాలన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లతో ఉత్తమ పరిశోధన పత్రాల తయారీపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్‌ విభాగాధిపతి, వర్క్‌షాప్‌ కన్వీనర్‌ ఆంజనేయులు, ప్రిన్సిపాల్‌ మామిడాల ప్రవీణ్‌, కైసర్‌ మహమ్మద్‌, అపర్ణ, రాజేశ్వరి, వాణి, కిరణ్‌ రాథోడ్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం రాంపూర్‌ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000కు చెందిన పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌

బాల్కొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. మంగళవారం మెండోరా మండలం పోచంపాడ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల కోసం వండిన అన్నంను, కూరలను పరిశీలించారు. స్టాక్‌ రూంలో నిల్వ ఉంచిన బియ్యం, పప్పుల నాణ్యతను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు పోచంపాడ్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మందుల స్టాక్‌ ను పరిశీలించారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమ పాఠశాలల జోనల్‌ ఇన్‌చార్జి పూర్ణచందర్‌, తహసీల్దార్‌ సంతోష్‌రెడ్డి, వైద్యాధికారి రాకేశ్‌, ప్రిన్సిపాల్‌ గోదావరి తదితరులు ఉన్నారు.

పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు



ఖలీల్‌వాడి/ నందిపేట్‌: నకిలీ గల్ఫ్‌ ఏజెంట్‌ దాడి చేసిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటు బాధితులు భూపతి నరసింహమూర్తి, మహేశ్‌లు హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ వెంకటయ్యను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. తమపై దాడి చేసిన గల్ఫ్‌ నకిలీ ఏజెంట్‌లపై నందిపేట్‌ పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేసినా కేసులో పురోగతి లేదన్నారు. దీనిపై విచారణ చేస్తామని చైర్మన్‌ హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

మక్కల ధర ఢమాల్‌

- కొనుగోళ్లపై 'కోళ్ల వైరస్‌' ప్రభావం
- రోజురోజుకూ తగ్గుతున్న ధర



ముప్కాల్‌ మండల కేంద్రంలో ఆరబెట్టిన మక్కలు

బాల్కొండ: యాసంగిలో సాగు చేసిన మక్కజొన్న పంట ప్రస్తుతం చేతికి వచ్చింది. ఎంచక్కా విక్రయించి లాభాలు ఆర్జించవచ్చనుకున్న రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. రోజురోజుకూ మార్కెట్‌లో మక్కల ధరను వ్యాపారులు తగ్గిస్తూ వస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించే రైతులకు.. పౌల్ట్రీపై పడిన వైరస్‌ ప్రభావమంటూ వ్యాపారుల నుంచి సమాధానం వస్తోంది.

తగ్గిన డిమాండ్‌

పౌల్ట్రీఫామ్‌లో కోళ్ల పెంపకానికి వినియోగించే దాణాలో మక్కలను అధికంగా వినియోగిస్తారు. దీంతో వ్యాపారులు ప్రతి సీజన్‌లో రైతుల నుంచి ఎక్కువ మొత్తంలో మక్కలను కొనుగోలు చేస్తుంటారు. కానీ, కొన్ని నెలలుగా వైరస్‌ ప్రభావంతో ఫామ్‌లలో వేలాదిగా కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. దీంతో ఫారాల యజమానులు మక్కల కొనుగోలుకు వెనుకంజ వేస్తున్నారు. ఖరీఫ్‌లో మక్కల ధర క్వింటాలుకు రూ.2500 పలికింది. ప్రస్తుతం జొన్నకు ప్రత్యామ్నాయంగా రైతులు మక్కజొన్న అధికంగా సాగు చేశారు. మొదట క్వింటాలు మక్కలకు రూ.2300 చెల్లించిన వ్యాపారులు, తాజాగా రోజుకో రూ.100 తగ్గిస్తూ క్వింటాలుకు రూ.2100 నుంచి రూ.2200 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వమే మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిధులు కేటాయించారు.. నిర్మాణాలు మరిచారు

- అద్దె భవనాల్లోనే బీసీ గురుకులాలు
- 2024–25 బడ్జెట్‌లో సొంత భవనాల కోసం నిధుల కేటాయింపు



మోర్తాడ్‌లోని అద్దె భవనంలో కొనసాగుతున్న జ్యోతీబాపూలే గురుకుల పాఠశాల

మోర్తాడ్‌(బాల్కొండ): జిల్లాలో వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం మోర్తాడ్‌, కుద్వాన్‌పూర్‌, ఆర్మూర్‌, ఎడపల్లి, బోధన్‌, శ్రీరాంపూర్‌, చీమన్‌పల్లి, నిజామాబాద్‌లలో బాలబాలికలకు వేర్వేరుగా మహాత్మా జ్యోతీబా పూలే గురుకులాలు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం నియోజకవర్గానికి బాలుర కోసం ఒకటి, బాలికల కోసం మరో విద్యా సంస్థలను ప్రారంభించింది. ఒక్కో గురుకులంలో 400 నుంచి 500 మంది వరకు పిల్లలు విద్యాభ్యాసం చేస్తున్నారు. సొంత భవనాలను నిర్మించేందుకు 2024–25 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,546 కోట్లు కేటాయించింది. మరికొద్ది రోజుల్లో 2025–26 బడ్జెట్‌ సమావేశాలు జరగనున్నాయి. అయినప్పటికీ బీసీ గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడం గమనార్హం.

కొన్ని చోట్లే ఇంటర్‌ విద్య..

పేరుకే అన్ని గురుకులాల్లో ఇంటర్‌ విద్య అందిస్తున్నట్లు రికార్డులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఒకటి, రెండు చోట్లనే కొనసాగుతున్నాయి. ఇంటర్‌ విద్యను ఆరంభించిన తర్వాత గదుల కొరతతో కేవలం కంజర కళాశాలలోనే విద్యార్థులకు చదువు చెబుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికైనా సొంత భవనాల కల నెరవేరుతుందని అంతా ఆశించినా.. ఇప్పటి వరకు ఎక్కడ కూడా స్థల సేకరణ జరగకపోవడంతో కలగానే మిగిలిపోయింది.

ఇరుకుగదుల్లోనే..

బీసీ గురుకులాల విద్యార్థులు అనువైన భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లోనే వందలాది మంది విద్యార్థులకు వసతి, విద్యాబోధన ఇబ్బందిగా మారింది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పాఠశాల, కళాశాలలకు సొంత భవనాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్‌ సరఫరాలో సిబ్బంది పాత్ర కీలకం



క్షేత్రస్థాయి సిబ్బందిని సన్మానించిన అధికారులు

సుభాష్‌నగర్‌: విద్యుత్‌ సరఫరాలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే లైన్‌మన్లు, ఆర్టిజన్‌, ఆన్‌ మ్యాన్‌, జేఎల్‌ఎం, ఎల్‌ఐ, ఎస్‌ఎల్‌ఐల పాత్ర కీలకమని డిచ్‌పల్లి డీఈ ఉత్తమ్‌ జాడే పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పవర్‌హౌస్‌ సమావేశపు హాల్‌లో లైన్‌మన్‌ దివస్‌ సందర్భంగా క్షేత్రస్థాయి సిబ్బంది సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈ మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్‌లో క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బంది సేవలు అమోఘమని కొనియాడారు. సభాధ్యక్షుడు నిజామాబాద్‌ రూరల్‌ ఏడీఈ రెంజర్ల బాలేశ్‌కుమార్‌ మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్‌ లక్ష్య సాధనలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమని, ఎంతో జాగ్రత్తతో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈలు రాజేందర్‌, శ్రీనివాస్‌, నాగశర్వాణి, భాస్కర్‌, శంకర్‌ గౌడ్‌, ప్రవీణ్‌కుమార్‌, సబ్‌ ఇంజినీర్‌ కుమారి దివ్య, భరత్‌, సీనియర్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు, అసిస్టెంట్‌ లైన్‌మన్లు, జూనియర్‌ లైన్‌మన్లు, ఆర్టిజన్లు, ఆన్‌మ్యాన్‌ కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ శిలాఫలకం ధ్వంసం

మాచారెడ్డి: పాల్వంచ మండలం పోతారంలో గుర్తు తెలియని వ్యక్తులు బీఆర్‌ఎస్‌ జెండా గద్దెతో పాటు సీసీ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. బీఆర్‌ఎస్‌ గ్రామశాఖ అధ్యక్షుడు పైడాకుల రాములు గద్దె, శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రైం కార్నర్‌

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అభిజిత్‌ (ఫైల్‌)

తాడ్వాయి: పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయి మండలం దేమికలాన్‌ గ్రామానికి చెందిన బంగారుగల్ల అభిజిత్‌(24) అనే యువకుడు చిన్న నాటి నుంచి అమ్మమ్మ శాంతవ్వ వద్ద పెరుగుతున్నాడు. పనిచేసుకుంటు బతకాలని అభిజిత్‌ను అమ్మమ్మ బెదిరించడంతో ఈ నెల 1న పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుంటి తండాలో పునాదులు ధ్వంసం



పునాదులను ధ్వంసం చేస్తున్న అధికారులు

మాచారెడ్డి: తాతల నాటి నుంచి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ గిరిజన రైతు అక్కడ ఇంటి నిర్మాణం కోసం తీసిన పునాదులను మంగళవారం అటవీ శాఖ అధికారులు ధ్వంసం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం గుంటి తండాకు చెందిన లకావత్‌ లచ్చిరాం కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తూ కుటుంబంతో గుడిసెలో నివాసం ఉంటున్నాడు. గుడిసెను తొలగించి ఇల్లు కట్టుకోవాలని ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్‌ తెప్పించుకొని పునాదులు తవ్వించాడు. అటవీ శాఖ అధికారులు మంగళవారం పొక్లెయిన్‌తో పునాదులను ధ్వంసం చేశారు. ఈ విషయమై మాచారెడ్డి ఎఫ్‌ఆర్వో దివ్యను వివరణ కోరగా అటవీ స్థలంలో ఇల్లు నిర్మిస్తున్నారన్న సమాచారం మేరకు రెండుసార్లు నోటీసులు ఇచ్చినా ఇంటి నిర్మాణ పనులు చేపట్టారని, ఉన్నతాధికారుల ఆదేశాలతో అటవీ స్థలంలో నిర్మిస్తున్న ఇంటి పునాదులను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 11 గొర్రెలు మృతి



మోపాల్‌: మండలంలోని కులాస్‌పూర్‌ తండాలో కుక్కల గుంపు దాడి చేయడంతో చందర్‌కు చెందిన 11 గొర్రెలు మంగళవారం మృతిచెందాయి. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన చందర్‌ 18 గొర్రెలను ఇంటి ఆవరణలోనే పెంచుతున్నాడు. రోజులాగే పొలానికి నీరు పెట్టేందుకు మధ్యాహ్నం వెళ్లాడు. కుక్కల గుంపు ఒక్కసారిగా గొర్రెలపై దాడి చేయడంతో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల మృతితో సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు చందర్‌ కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఎడపల్లి: జానకంపేట శివారులోని అలీసాగర్‌ ఎత్తిపోతల కాలువలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం లిఫ్ట్‌ పంప్‌ హౌస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాలువ నుంచి ఈతగాళ్ల సాయంతో బయటకు తీయించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని, ఒంటిపై ఎలాంటి గాయాలు లేవన్నారు. లిఫ్ట్‌ ఉద్యోగుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అవమానించాడని స్నేహితుడిపై కత్తితో దాడి

ఖలీల్‌వాడి: తనతో పాటు కుమారులను అవమానించడనే కోపంతో ఓ తండ్రి స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన ఘటన నగరంలోని గాజులపేట్‌లో చేసుకుంది. రెండో టౌన్‌ ఎస్సై యాసిన్‌ అరాఫత్‌ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గాజులపేట్‌కు చెందిన మహేశ్‌, సంతోష్‌ ఇద్దరు స్నేహితులు. వీరు ఓ చోట మద్యం సేవించి ఇరుకుటుంబాల గురించి చర్చించుకున్నారు. ఈ క్రమంలో సంతోష్‌ కుమారులకు నత్తి ఉందని మహేశ్‌ అనడంతో గొడవ జరిగింది. దీంతో సంతోష్‌ తనను, తన కుమారులను అవమానించాడనే కోపంతో ఇంటికి వెళ్లి కత్తి తీసుకొచ్చి మహేశ్‌పై దాడి చేశాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌ చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌ సమీపంలో ఉన్న ఎస్బీఐ ఏటీఎం వద్ద పార్క్‌ చేసిన బైక్‌ చోరీకి గురైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. నగరంలోని ముస్తాయిపురాకు చెందిన షేక్‌ అహ్మద్‌ బస్టాండ్‌ సమీపంలో ఉన్న ఎస్బీఐ ఏటీఎంకు బైక్‌పై వచ్చాడు. బైక్‌ పార్క్‌ చేసి ఏటీఎం లోపలికి వెళ్లి వచ్చే సరికి బైక్‌ చోరీకి గురైందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య


ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో మంగళవారం వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో ఒకరు, మద్యానికి బానిసై మరొకరు, కుటుంబ కలహాలతో ఒకరు, పెళ్లి కావడం లేదని యువకుడు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పోలీసులు కేసులు నమోదు చేశారు.



గంధం గంగాధర్‌ మృతదేహం

నందిపేట్‌: అప్పుల బాధతో ఒకరు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నందిపేట మండలం అయిలాపూర్‌ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్‌ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన గంధం గంగాధర్‌(46) మూడేళ్ల క్రితం గల్ఫ్‌ దేశానికి వెళ్లి నెల రోజుల క్రితం తిరిగి వచ్చాడు. దీంతో చేసిన అప్పులు ఎక్కువ కావడంతో మానసికంగా కుంగిపోయి అయిలాపూర్‌ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడు..



ప్రవీణ్‌కుమార్‌ (ఫైల్‌)

లింగంపేట: పెళ్లి కావడం లేదనే మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన లింగంపేట మండలం శెట్పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి ప్రవీణ్‌కుమార్‌(27) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి తల్లిదండ్రులు గతంలో చనిపోయారు. అక్క మౌనికతో కలిసి ఉంటున్నా డు. అనారోగ్యానికి గురైన బంధువులను పరామర్శించేందుకు మౌనిక వేరే గ్రామానికి పది రోజుల క్రితం వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ప్రవీణ్‌ కుమార్‌ తనకు ఇంకా వివాహం కావడం లేదనే మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నా డు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు..

పిట్లం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్లం మండలం చిల్లర్గిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి ప్రకాశ్‌(37) కొంత కాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పనిచేయకుండా తిరుగుతున్నాడు. జీవితంపై విరక్తితో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

ఎల్లారెడ్డి: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమార్‌పేట్‌ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డికి చెందిన మ్యాతరి సతీశ్‌(42) ఇంట్లో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపంతో గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురు ఏజెంట్ల అరెస్ట్‌

ఖలీల్‌వాడి: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిజామాబాద్‌ జిల్లా యువకులను మోసం చేసిన ముగ్గురు ఏజెంట్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్‌ క్రైమ్‌ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాకు చెందిన అలకుంట సంపత్‌, జగిత్యాల జిల్లాకు చెందిన దండుగుల చిరంజీవి, మిట్టపల్లి నర్సారెడ్డిలు థాయిలాండ్‌, లావోస్‌ దేశాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి జిల్లాకు చెందిన బాధితుల నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేశారు. వీరిని లావోస్‌ దేశంలో బంధించి సైబర్‌ నేరాలు చేయించారు. చివరికి ఇద్దరు బాధితులు భారతీయ రాయబార కార్యాలయం సహాయంతో స్వదేశానికి తిరిగి వచ్చి ఏజెంట్లపై ఫిర్యాదు చేశారు. పోలీసులు ఏజెంట్లను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజుల జ్యుడీషియల్‌ రిమాండ్‌ విధించారు. వీరిని సారంగాపూర్‌ జిల్లా జైలుకు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.